# రోత

ఛ ఛ. అలా బుర్ర వూపే సిందేవిటి? మళ్ళీ ఎం. ఎస్. సి. చదివింది చదువుకూ, హృదయానికీ సంబంధం లేదేమో! పోనీ. ఆరెంటికీ సంబంధం లేకపోయినా మనువుకూ, మనసుకూ. యెందుకుండదూ? మరెందుకలా వేసింది? అక్కకు ఎలాంటి ఆలోచనలూ, ఆశయాలూలేవా? అక్కకూ అతనికీ ఏ మాత్రం పరిచయంలేదు. నాన్న ఫలానా సంబంధం చూసేననగానే, గంగిరెద్దులా తలూపేసింది, ప్రేమ అనేపదం ఆమె నిఘంటువులో వున్నట్లులేదు - భారతి భారంగా నడుస్తోంది. ఆలోచిస్తూ, కాళ్ళ కింద యిసక. జోళ్ళల్లోకి దూరుతూ, పక్కనే సముద్రం హోరు పెడుతూ.

భారతి నడుస్తోంది. సముద్రాన్ని సున్నితంగా తాకుతున్న సన్నని సూర్య కిరణాల సోయగాల్ని చూడడంలేదు. కెరటాల కౌగలింతలతో కేరింతాలు కొడుతున్న కుర్రాళ్ని చూడడంలేదు. ఆమె ధ్యాసంతా అక్కమీదే.

అంతవరకూ సముద్ర కెరటాల సరాగాల్ని చూస్తూ, ఆనందించిన వాళ్లు, కాలాన్ని వృధా చేశామనుకుంటూ భారతి

మీదకు దృష్టి మళ్ళించారు. ఆమె వొంటి వెన్నెల వన్నెల్ని మగకళ్ళు మత్తుగా తాకుతున్నాయి.

సముద్రుడికి సరదా వేసింది. భారతి కాళ్ళమీద పడిపోయాడు. సరే సిగ్గెలాగూ వదిలేశానుగదా అని ఆమె చీర కుచ్చెళ్లు పట్టుకున్నాడు. భారతి ఒక్కసారి తలవిదిలించి చూసింది. ఆమెకు దగ్గర్లో ఒకతను కళ్ళు మూసుకుని కూచున్నాడు. అతని వంక చూసింది. నలిగిన బట్టలు మాసిన గడ్డం. మోకాళ్ళ వరకూ తడిసిన పేంటు.

"భాస్కర్ కూడా యింతే ఎంత నిర్విచారంగా వుంటాడో ఒక్కసారి" అనుకుంది భారతి. అటూ. యిటూ చూసింది. 'క్వాలిటీ' దూరంగా కాస్టలీగా కనిపించింది. 'తను ఇవేళయినా వస్తాడోరాడో. తనకే ప్రమాదమూ కలగలేదుకదా' భారతి గుండె గడగడలాడింది.

"ఎంత ధైర్యం భాస్కర్‌కు! ఎం. ఎ. చదివాడు. తన సుఖం వదులుకున్నాడు. ప్రజల కోసం ప్రమాదాలనే వరించాడు. భయం బతుకునే భరించాడు. ఇలాంటి వాళ్ళెందరుంటారు!" భారతి గుండెలో గర్వం పూసింది.

భారతి కళ్ళింతింత చేసుకుని చూస్తూ నడుస్తోంది. భాస్కర్ రూపం మనసులో మెదిలింది. ఆమె మనస్సు మల్లెపూవులా మురిసిపోయింది. కిందటి వారం వస్తానన్నాడు. రాలేదు. బీచ్ అంతా ఎంత ఆశగా గాలించింది తనూ, ఒక్కనిమిషం ఆమెకు బాధ కలిగింది. భాస్కర్ కావాలని రావడం మానడుకదా. వీలు పడలేదేమో. ఐనా. ఎక్కడిపడితే అక్కడ ఎప్పుడు పడితే అప్పుడు తిరగడం భాస్కర్‌కు కుదరదు కదా. అతని కోసం గాలించే కళ్ళుంటాయి. గేలాలు ధరించి పొంచివుండే చేతులుంటాయి.

ఒకవైపు బాధల్ని భరిస్తూనే. మరోవైపు చిరునవ్వులు చిందిస్తాడు. భాస్కర్‌లాంటి వాణ్ని ప్రేమించటం ఎంత అదృష్టం! నో నో, నాలాంటి దానికి భాస్కర్ మనసివ్వడం ఎంతో అపురూపం.

చీకటి పడింది.! ఇల్లూ, పొయ్యీ గుర్తొచ్చి, ఒకరొకరూ గబగబా రోడ్డెక్కి పోతున్నారు. వాన రాకడా. విశాఖ సిటీ బస్సుల పోకడా. తెలీదుకదా అనుకుంటూ రోడ్డు పక్కన నిలుచున్నారు.

"భారతీ" చిన్నగా పిలుపు. భారతి వేగంగా అటువైపు చూసింది. భాస్కర్, ఆమె కళ్ళు కళకళలాడాయి. ఆమె కాళ్ళు పరిగెట్టబోయాయి. బలవంతంగా కాళ్ళకు బ్రేకు వేసింది. ఓ మూలంగా కూర్చున్నాడతను. అతనికి దగ్గరగా భారతి కూర్చుంది. భాస్కర్ మాటాడలేదు. ఆమెనే చూస్తున్నాడు. భారతి కళ్లు దించుకుంది. హాయిగా ఫీలవుతూ.

"మొన్నటివారం వచ్చావా భారతీ"

"వూఁ"

"నేను రాలేకపోయాను. ఆ రోజున కొండ వెనక కాపురం చేశాను. కాల్పులు జరిగాయి. మా మిత్రుడొకడు చనిపోయాడు" భాస్కర్ కంఠం కొద్దిగా వణికింది.

"అయ్యో" అంది భారతి సానుభూతిగా.

"నా విషయం ఎక్కడా ఎత్తడం లేదుకదా"

"భలేవాడివే నీకు ప్రమాదం జరిగితే నాక్కాదూ" అంది భారతి చురుగ్గా తలెత్తి.

భాస్కర్ తన గురించి చెబుతున్నాడు. అతని మాటల్లో ఈ సమాజంపై దారుణ ద్వేషం. మనుషులపై వల్లమాలిన ప్రేమ. భారతి తన్మయత్వంతో వింటోంది. ఆమె కళ్ళముందు బంగారు భవిష్యత్తు కదలాడుతోంది.

"చిక్కిపోయావు భాస్కర్."

"ఈ పదిహేను రోజులకే! నువ్వు బాగా చదువుతున్నావా?"

"బాగానే చదువుతున్నా. నువ్వే నా చదువు చెడగొడుతున్నావ్"

"నేనా"

"అవున్నవే. అస్తమానం గుర్తొస్తావ్. చదవ బుద్దికాదు. నీ గురించే ఆలోచించుకుంటా"

"మరెలాగా" అన్నాడు భాస్కర్. అతని ఒళ్ళు పులకించింది. భారతి చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

భాస్కర్ ముఖంలో మొలిచిన ఆనందాన్ని భారతి గమనించింది.

"బుర్ర పాడుచేసుకోకు, సరదా కన్నాను" అంది భారతి నవ్వుతూ.

"ఎన్నికష్టాలు ఎదురైనా, నిన్ను చూస్తే అన్నీ మరచిపోతాను. భారతి నువ్వు నాకు మంచి టానిక్"

"నయమే టాబ్లెట్ అన్నావు కావు. సరేకానీ, మళ్ళీ యెప్పుడొస్తావ్"

"అంటే, వెళ్ళిపొమ్మనా"

"చాల్లే"

"ఓ రెండు వారాలు పోయేక వస్తాను"

"చెప్పడం మర్చిపోయాను మా అక్కా ముక్కూ మొగమూ ఎరుగని ఓ ఆఫీసర్ని పెళ్ళాడుతోంది."

"మంచిదేకదా"

"ఏం మంచి? కనీసం పరిచయమైనాలేని వ్యక్తితో ఎలా గడుపుతుంది"

"అంత ఇదయిపోతావేం? మీ అక్కేకాదు. మన దేశంలో యించు మించు అంతా అంతే మరి మన పెళ్ళెప్పుడు?"

"నా చదువయ్యి ఉద్యోగం వచ్చేక"

"మీ ఇంట్లో నీ కోసం ఎదురు చూస్తుంటారేమో! బాగా పొద్దు పోయింది. వెళ్ళిరానా" దిగులుగా అన్నాడు భాస్కర్. ఆమె చేతిని ముద్దు పెటుకుంటూ.

"జాగ్రత్త భాస్కర్ నువ్వు కనిపించేదాకా. నాకెంత బెంగగా వుంటుందో తెలుసా" భారతి కళ్ళల్లో సన్నటి నీటి పొర.

♦ ♦ ♦

ఇల్లంతా హడావుడిగా వుంది. ఆడవాళ్ళు పట్టుచీరలతో జరజర శబ్దం చేస్తూ తిరుగుతున్నారు. భారతి వాళ్ళను వింతగా చూసింది.

ఆ రాత్రి భారతి అక్క వివాహం జరిగిపోయింది. అక్క పెళ్ళి పీటలమీద తలొంచుకుని కూచుంటే, భారతి నవ్వుకుంది! శుభ్రంగా పెళ్ళి చేసుకుంటూ ఏదో తప్పుచేసినట్టు తలెందుకు వంచుకోవాలో ఆమె కర్థం

కాలేదు। మర్నాడు అక్కను వెక్కిరిస్తే ఆమె భారతిని కోపంగాచూసింది. తర్వాత కొత్త పెళ్ళికొడుకు కొత్త స్కూటరు కావాలని అలకపాన్పు యెక్కాడు. భారతికి అసహ్యం అనిపించింది. కంగారుపడిన తండ్రిని చూసి జాలేసింది. "నా దేశంలో కూతుళ్ళంటే తల్లితండ్రుల రక్తం పీల్చేవాళ్ళన్న మాట" అనుకుంది భారతి బాధగా.

బలేవాణ్ని చేసుకున్నావే." అంది భారతి కోపంగా.

"నోరు మూద్దూ. స్కూటరేకదా ఆయన అడిగారు. ఇలాంటివి ఎంతమంది అడగరూ" అంది భారతి అక్క "మొగుణ్ని" వెనకేసుకొస్తూ.

అక్క మాటకు భారతి ఆశ్చర్యపోయింది. తండ్రి తల తాకట్టు పెట్టి అల్లుడి కోరిక తీర్చాడు. పెళ్ళివారు వెళ్ళిపోయారు.

—ఇల్లు ప్రశాంతంగా వుంది. ఇంట్లోవాళ్ళంతా ప్ర శా ం త ం గా వున్నారు, ఒక్క తండ్రితప్ప. "అప్పుల గురించి నాన్న ఆలోచిస్తున్నాడు పాపం" అనుకుంద భారతి. "అక్కలా తనుమాత్రం తండ్రికి భారం కాకూడదు" అనుకుంది భాస్కర్ గుర్తొచ్చాడు. రెండు వారాల్లో వస్తానన్న భాస్కర్ రాలేదు.

వెన్నెల వెన్నలా మెత్తగా చల్లగా వుంది. ఆ చల్లదనాన్ని అద్దుకుంటూ కొండలు వేడిని దూరం చేసుకుంటున్నాయి. కొండలపై చెట్లు పచ్చగా నవ్వుతూ కళకళలాడిపోతున్నాయి. తుప్పలమీంచి తెల్లపూలు తళతళలాడుతూ చూస్తున్నాయి. గుత్తులు గుత్తులుగావున్న తెల్లపూలు ఆకాశంలోని నక్షత్రాల్లా వున్నాయి.

అంతలో గాలి బాకీ పాటలు పాడుతూ తెల్లపూలను తాకింది. పూలు పిచ్చిగా వణికిపోయాయి. అయోమయంగా అదిరిపోయాయి. తుపాకీలు తూటాలను వదులుతున్నాయి. తుపాకీలను పట్టుకున్న చేతులు భయంగా బేలగా వున్నాయి. తుపాకీలను పట్టుకున్న చేతులు ధైర్యంగా దీక్షతో వున్నాయి. రెండు వైపులనుంచీ కాల్పులు జరుగుతున్నాయి. వెన్నెల వింతగా చూస్తోంది. కాల్పుల శబ్దానికి జంతువులు కంగారుగా ప్రాణభీతితో పారిపోతున్నాయి.

భాస్కర్ తుపాకీని గట్టిగా పట్టుకున్నాడు. గురిచూసి "మరో ప్రపంచం" కోసం పేల్చుతున్నాడు. ఇంతలో భాస్కర్ మిత్రుడు 'అబ్బా' అన్నాడు. అంత బాధలోనూ చాలా నెమ్మదిగా అన్నాడు. భాస్కర్ గ్రహించాడు. అతని ముఖం ఎర్రబడింది. పళ్ళు బిగించాడు. తుపాకీని మరింతగట్టిగా పట్టుకున్నాడు, బోర్లాపడుకుని, కొండరాళ్ళమీద మోచేతుల్తో దేకుతున్నాడు కాళ్ళూ చేతులూ కొట్టుకు పోతున్నాయి. అతను లెక్కచేయలేదు. ట్రిగ్గర్ నొక్కాడు. అటువైపు నుంచి మూలుగు వినిపించింది మరింత ఉత్సాహంగా ముందుకు కదులుతున్నాడు. మోచేతులకూ, మోకాళ్ళకూ రాళ్ళు తగిలీ, ముళ్ళు గుచ్చుకునీ రక్తం కారుతోంది. రయ్‌మని దూసుకువచ్చి అతని ఛాతీలో గుండు తగిలింది, భాస్కర్ మెలితిరిగి పోయాడు. ఛాతీనుంచి రక్తం కారుతోంది. అయినా అతను లేని ఓపికను తెచ్చుకుని, జారిపోతున్న తుపాకీని పట్టుకుని ముందుకు దేకాలని ప్రయత్నిస్తున్నాడు అప్పుడు భాస్కర్‌ను చూసిన వెండి వెన్నెల విలవిల్లాడిపోయి, నల్లబడిపోయింది. తెల్లపూలు రోదిస్తూ ఎర్రబడిపోయాయి.

—భారతి కళ్ళంట నీళ్లు కారిపోతున్నాయి. ఒక్కసారి తలవిదిలించి చూసింది. మళ్ళీ అవే అక్షరాలు కనిపించాయి, "ఎదురు కాల్పుల్లో ఇద్దరి మృతి". కేవలం వార్త చదివి ఇంతలా వూహించెయ్యడం చాలా దారుణం' అనుకుంది భారతి కళ్ళు తుడుచుకుంది.

♦ ♦ ♦

చీకటి వెలుగును మింగుతోంది, సముద్రం హోరు పెడుతోంది, భారతి సముద్రంకేసి చూస్తోంది. కానీ, సముద్రాన్ని చూడడంలేదు. హోరును వినడంలేదు. ఆమె కళ్ళముందు భాస్కర్ కదులుతున్నాడు.

"కిందటిసారి వస్తానని రాలేదు. ఇప్పుడైనా వస్తాడో, రాడో? భాస్కర్ క్షేమంగావున్నాడో, లేడో? అతను కంటికి కనిపించేదాకా ఈ ఆందోళన తప్పదు" అనుకుంది భారతి.

నిమిషాలు నిర్వికారంగా నడుస్తున్నాయి. భారతి భారంగా అటూ, యిటూ చూస్తోంది చిరు చీకట్లో భాస్కర్ కనిపించాడు. ఆమె కళ్ళకు కాంతి వచ్చింది. 'భాస్కర్' అని ఆనందంగా పిల్చింది.

ముందుకువచ్చి, భాస్కర్ నవ్వాడు, వెన్నెల విరియలేదు, పేపర్లో వార్త చదివి తనెంత భయపడిందీ భారతి చెప్పింది. ఎలా వూహించుకున్నదీ చెప్పింది భాస్కర్ మౌనంగావిన్నాడు తర్వాత నెమ్మదిగా కబుర్లలోకిదిగాడు

"భారతీ ఈ మధ్య మా ఉద్యమం ఏమంత ఉత్సాహకరంగా లేదు"

"ఏం"

"మాలోనూ రకరకాల రాజకీయాలు వచ్చాయి. వర్గాలుగా విడిపోతున్నాయి"

భారతి వింది. ఆలోచిస్తోంది. భాస్కర్ చెబుతున్నాడు. ఆమె వింటోంది. అతన్ని చూస్తోంది. కొంతసేపయిన తర్వాత. భారతి తన అక్క వివాహ విషయాలు చెప్పింది. పెళ్ళికొడుకు కోరికల్నీ. అలకల్నీ. అన్నీ చెప్పింది. యెంతో కోపంగానూ చెప్పింది.

"ప్రతిదానికీ అంత వుద్రేకం తెచ్చుకుంటే ఎలా? కొన్నిటికి రాజీపడిపోవాలి."

"నాకు చేతకాదు"

"మరింక నే వెళ్ళొస్తాను. మళ్ళీవారం నువ్వు తప్పకుండా రావాలి. నీకో శుభవార్త చెబుతాను" అని భారతి చేతిని సుతారంగా నొక్కి, గబగబా వెళ్ళిపోయాడు. భాస్కర్ చీకట్లోకి. చీకటి చిక్కబడింది.

♦ ♦ ♦

భారతి కోసం భాస్కర్ ఎదురు చూస్తున్నాడు. ఒకవైపు అతనికి ఆనందంగా వుంది. మరోవైపు అశాంతిగా వుంది. 'నేను చెప్పేవార్త విని భారతి తప్పక సంతోషిస్తుంది' అనుకున్నాడు.

"భాస్కర్ శుభవార్త చెబుతానన్నాడు. ఏవిటయ్యుంటుంది?" అనుకుంటూ ఆలోచిస్తూ భారతి వచ్చింది. భాస్కర్ ముందు కూర్చుంది. అతను చాలా సేపటి వరకూ మాట్లాడలేదు.

"ఏమిటి మహాశయా. అలా మౌనంగా కూర్చున్నావ్, ఎంతసేప యింది. వచ్చి? మొన్నేదో శుభవార్త చెబుతానన్నావుకదా. మురిపించి, మురిపించి చెప్పాలనా ఈ మౌనవ్రతమంతా?"

"అదేం కాదులే. విషయమంతా చెప్పి, శుభవార్త చెప్పడమా "ముందే చెప్పి విషయమంతా తర్వాత చెప్పడమా? అని ఆలోచిస్తున్నాను"

"నీ యిష్టం, నీకెలాగ సులువనిపిస్తే అలా చెబుదూ" అంది భారతి నవ్వుతూ.

"అవునూ, ఎప్పుడూ నాకంటే ముందువచ్చే దానివి యివేళ ఆలస్యంగా వచ్చావేం"

"దారిలో స్నేహితురాలు కనిపించింది ఒకటే నస. భరించక తప్పలేదు తర్వాత బస్సుదొరికి చావలేదు దానికేం గాని, మహా వూరించక, చెబుదూ"

భాస్కర్ ఇసకమీద పిచ్చిగీతలు గీస్తున్నాడు. మళ్ళీ చెరిపేస్తున్నాడు తలెత్తి భారతిని చూశాడు.

"నువ్వు ఇవాళ్టి పేపరు చూడలేదా"

"చూడలేదు, వీలుపడక. ఏం"

"మా నాయకులు కొందరు అరెస్టయ్యారు"

"అరె ఎలా" ఆందోళనగా భారతి

"నిన్న రాత్రి వాళ్ళంతా సమావేశమయి, మాట్లాడుకుంటుండగా పట్టుబడ్డారు"

"అయ్యో"

"ఇంక నేను ఉద్యమంలో పని చెయ్యదలచుకోలేదు. నాకు లెక్చరర్ ఉద్యోగం వచ్చింది. ఇకనుంచి నీ కోసం బతకాలనుకుంటున్నాను హాయిగా నువ్వూ, నేనూ, పెళ్ళిచేసుకుందాం"

భారతి నమ్మలేనన్నట్టు భాస్కర్‌ను చూసింది. జోక్ చేస్తున్నాడేమో అనుకుంది. అయితే అతను సీరియస్‌గా చెబుతున్నట్టు కనిపించాడు. ఆమె కంతా అయోమయంగా వుంది.

"గమ్మత్తుగా వుందే. నీకింత తొందరగా ఉద్యోగమెలా వచ్చింది?" అని అడిగింది భారతి ఆమె కంఠంలో అసహనం, అనుమానం.

"ఈమధ్య నా గురించి పోలీసులకు తెలిసింది. నన్ను వెంటాడారు. ఐతే, అరెస్టు చెయ్యలేదు. కిందటి వారం ఓ పోలీస్ అధికారి నన్ను కలిశాడు ఇంత మంచి చదువున్న మీరు యిలా ఎందుకూ కొరగాకుండా పోవడం ఏమీ బాగా లేదన్నాడు. ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. మొదట నేనూ ఆశ్చర్యపోయాను. తర్వాత ఆలోచించాను. ఉద్యమం బలహీన పడుతోంది. అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలమనే ఆశ కనుచూపు మేరలో కన్పించడంలేదు నాతోపాటు నీ బతుకును కూడా ఎందుకు వృధా చెయ్యాలనుకున్నాను. అందుకే, ఆ అధికారి చెప్పినట్టు చేశాను"

గుప్పిట్లోకి ఇసక తీసుకుంటూ "ఏం చేశావ్" అంది భారతి ఆత్రుతగా.

"మా నాయకులు ఎక్కడ సమావేశ మయ్యారో చెప్పాను అతనికి."

"భాస్కర్" గుండెల్లో తుపాకి గుళ్ళు పేలిన చప్పుడు.

"పోలీసులు వెళ్ళి, వారిని అరెస్టు చేశారు."

"అయ్యయ్యో. ఎంతపని చేశావ్? నువ్వు మనిషివేనా? ఛీ ఛీ. ఎంత నీచంగా ప్రవర్తించావ్" పిడికిలి బిగించి కోపంగా అంది భారతి.

"ఉద్యోగం ఇప్పిస్తా నన్నాడుగా"

"ఉద్యోగం కోసం, మనకోసం రాక్షసుడిలా మారతావా? సిగ్గులేదూ"

"పోనిద్దూ! జరిగిందేదో జరిగిపోయింది దాన్నింక మరిచిపోదాం. మనం త్వరగా పెళ్లి చేసుకుందాం"

"మ-న-కు ... పెళ్ళా?" అంది భారతి వెటకారంగా. సముద్ర కెరటాలు ఉవ్వెత్తున లేస్తున్నాయి.

"నువ్వెప్పుడైతే అలాంటి పని చేశావో, అప్పుడే నువ్వు నాకు దూరమైపోయావ్"

"ఆదేవిటి భారతీ. అలాగంటున్నావ్"

"ఇంకెలాగనను. ఇప్పటి నీలాంటి భాస్కర్‌లు నవాలక్షమంది వున్నారు. నువ్వే చెప్పు. నిన్నే ఎందుకు ఏరి కోరు కోవాలి? నిజానికి నువ్వు అందరి కంటే కూడా హీనం" భారతి లేచి నిలబడింది. ఆమె గుండె గిలగిల కొట్టుకుంటోంది. ముక్కు పుటలు అదురుతున్నాయి. ఆమెకు ఒంటికి కారం రాసుకున్నటుగా వుంది.

"మళ్ళీ ఇంకెప్పుడూ నీ ముఖం నాకు చూపించకు. నువ్వంటే నా కసహ్యం" అని గబగబా అనేసి, గుప్పిట్లోని ఇసకను జారవేస్తూ, పరుగులాటి నడకతో భారతి ముందు కెళ్ళిపోయింది. సముద్ర కెరటాలు ఆమెను తాకబోయి, భయపడి వెనక్కు వెళ్ళిపోయాయి

భాస్కర్ కంటిలో ఇసక రేణువు పడింది కళ్ళు మూసుకున్నాడు. కనురెప్ప నలిపి, తెరచి, త్వరత్వరగా పోతున్న భారతిని చూశాడు. భారతి కట్టుకున్న ఎర్రచీర దూరంగా కనిపించింది. చీకటి మరింత చిక్కబడింది

(ఉద్యమాన్ని దెబ్బ తీయడం ఎంతో హీనం అని తెలియచెప్పే
ఓ కథ రాయకూడదా! అని సూచించిన మిత్రులు చెలికాని
స్టాలిన్ [ఎం. ఎస్] గార్కి కృతజ్ఞతతో)

(సృజనసాహితి, సెప్టెంబర్ '83')